# ఓ వేకువ వెలుగులో...

తెల్లవారుఝాము మూడున్నర   నాలుగు

ఊరంతా మాటుమణిగినట్టు నిశ్శబ్దంగా వున్నది

అయినా పల్లెటూరు కాబట్టి చలిరోజులైనా, బావిలో నీళ్ళుతోడుతున్నట్టు గిలకలచప్పుడూ పశువులకు మేతవేస్తూ పనివాళ్ళ 'హేయ్ హేయ్'మనే కేకలూ అస్పష్టంగా విన్పిస్తూనే వున్నయ్

వెన్నెల ఎంతో స్వచ్ఛంగా వున్నది ఎంతో ఆహ్లాదంగా కూడా వున్నది

చలికి నా శరీరం గజగజ వణుకుతున్నది

పమిటను తీసి చుట్టూతా కప్పుకున్నాను

వెన్నెల ఓ కవి వర్ణించినట్టు గడ్డివాములమీద, కొష్టాలమీద, మఱ్ఱిచెట్టుమీద అన్నింటిమీదా తన సామ్యవాదాన్ని తెలియజెప్తున్నట్టు సమానంగా ప్రసరిస్తున్నది నేనూహించుకునే ఈ స్వప్న సౌందర్యం నా కండ్లముందే ప్రత్యక్షంగా కన్పించేసరికి మైమరచిపోతున్నాను

ఆ బస్‌స్టాప్ ఊరుకి చివరలో, ఒక గ్రంధాలయానికి దగ్గరగా వున్నది అంత చిన్న ఊరుకి మొత్తానికి గ్రంధాలయం, ఒక బస్‌స్టాప్ వుండటం ఆశ్చర్యమే! ఆ గ్రంధాలయం అరుగుమీదే బస్ కొరకు అందరూ కూర్చుంటారని తాతగారు చెప్పారు మూడున్నరకే లేచి నేను ప్రయాణమౌతుంటే తాతగారు అమ్మాయ్! ఆ బస్సు ఊరికి పెడగా ఆగుతుంది భయపడతావ్ అయినా అది తీరిగ్గా అయిదుగ్గానీ బయల్దేరదు ఎవరో ఒకర్ని తోడుపంపిస్తాను ఆగరాదూ? అన్నారు

"భయమేమిటి తాతయ్యా! నన్నెవరైనా మింగేస్తారా ఏమిటి? ఈ చాదస్తాలతోనే చంపుతున్నారు కోపంగా జవాబిచ్చి మరీ బయల్దేరాను తాతయ్య పక్షవాతం వల్ల లేవలేరు నేను బయల్దేరుతున్నందుకు అమ్మమ్మ సణుక్కుంటున్నా, నేను నవ్వుకుంటూనే సరదాగా వచ్చినప్పటి దారి గుర్తు చేసుకుంటూ వచ్చాను

"జీతగాళ్ళు పశువులకు మేత వేయడానికి వెళ్తుంటారు భయపడుతూ కూర్చోకు తాతగారు వస్తుంటే హెచ్చరించారు వెన్నెల్లో మఱ్ఱి వూడలు, ఆకుల వెలుగు నీడల్లో అస్పష్టంగా కన్పిస్తున్నయ్ ఆ మఱ్ఱివూడల్ని చూడగానే నా పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నయ్ సంగం జాగర్లమూడిలో మఱ్ఱిచెట్టు క్రింద నిలబడున్న కృష్ణమూర్తిగార్ని, ప్రసాద్‌గార్ని, మణినీ, రత్ననూ 'ఫొటో తీస్తాను నిలబడండి' అంటే- నేను క్లిక్ మన్పించడం, వాళ్ళందరూ ఒక్కసారే అనుకున్నట్టు మఱ్ఱి వూడలకి వేళ్ళాడి (కోతి) ఫోజు లివ్వడం ఒక్షణంలో గడిచిపోయింది ఆ సంఘటన గుర్తుకొచ్చి, ఫొటో వున్న బ్యాగ్ తడుముకున్నాను.

చలిగాలి వణుకుతో పాటు గిలిగింతలు పెడుతున్నది

మైమరచిపోయి ఆ అరుగుమీద అలాగే కూర్చున్నాను

ఒక్కసారి హఠాత్తుగా ఉలిక్కిపడ్డాను

దూరంగా ఏదో ఆకారం . తెల్లగా అస్పష్టంగా .

అమ్మో! ఏమిటిలా తాతయ్యగారు తాను రాలేకపోయినా, ఎవర్నన్నా పంపిస్తానన్నా వినకుండా ఒక్కదాన్నే వూరికి పెడగావున్న ఈ బస్‌స్టాప్‌కు వచ్చాను?

అంతవరకూ అందంగా, నవలల్లో, కథలల్లోని సీన్‌లా అద్భుతంగా, సౌందర్యభరితంగా కన్పించినా ఈ దృశ్యం ఓ క్షణం నాకు భీతిగొల్పింది ఒంటరితనంలోని వివశత భయం రూపంలో నాలో మెల్లమెల్లగా రెక్కలు విప్పుకుంటున్నది

ఎంత ధైర్యగా వుందామన్నా ఈ ఒంటరితనం, కాంపౌండ్‌వాల్ పడిపోయిన ఈ గ్రంధాలయం-గ్రంధాలయానికీ, బస్సు స్టాండ్‌కీ మధ్య నున్న వూడలుదిగిన మఱ్ఱివృక్షం యివన్నీ కలగలిపి ఆ వచ్చే ఆకారాన్ని గురించి నాలో వణుకు పుట్టిస్తున్నవి.

వెన్నెల స్పష్టంగా వున్నది!

ఆ ఆకారం కొంచెంకొంచెంగా దగ్గరౌతున్నది!

ఇప్పుడేమిటి దారి!

చుట్టూతా వున్న ఈ పశువులశాలలూ ఈ గడ్డివాములూ, మఱ్ఱిచెట్టూ - యివన్న నా బుఱ్ఱచుట్టూ ఒక పీడకలలా తిరుగాడబోతున్నాయా? ప్రకృతి సౌందర్యమనే పిచ్చితో యింతముందుగానే బస్‌స్టాప్‌కు బయల్దేరిన నేను ఆపదలో పడబోతున్నానా?

చటుక్కున నా బుఱ్ఱలో ట్యూబ్‌లైట్ వెలిగింది.

అవునూ! గ్రంధాలయానికి కరెంటు వుండే వుంటుంది కానీ ఎందుకనో అక్కడ చీకటిగావున్నది బహుశా అక్కడే ఎక్కడో స్విచ్‌బోర్డ్ వుండకుండా వుంటుందా?

ఎంతో స్వచ్ఛంగా అన్పించిన వెన్నెల నాకిప్పుడు చీకటిలా తోస్తున్నది. స్విచ్‌బోర్డు వుంటుందా? మనసు అటూయిటూ వూగిసలాడుతున్నది

ఎంత వెన్నెల్లో వున్నా చీకటి గదికి దగ్గరగా వున్నానని మొదటిసారిగా గుర్తించాను

లేచి గబగబవెళ్ళి, కళ్ళు నిగిడ్చి స్విచ్‌బోర్డుకోసం చూశాను అమ్మయ్య! స్విచ్‌బోర్డ్ చేతికితగిలింది లైట్‌వేస్తే అంత భయపడనక్కరలేదు కొంచెం రిలీఫ్ ఫీలయ్యాను

వరుసనే రెండు స్విచ్‌లు వున్నయ్!

రెండూ ఆదుర్దాగా నొక్కేశాను

ఊహు వెలగలేదు భరించలేని టిన్షన్

బల్బు వుండే డోమ్ వైపుచూశాను బల్బులేదు అయితే రెండో స్విచ్ దేనిదై వుంటుంది? ఆలోచించాను ఊహు దేనిదైనా వెలగలేదుకదా ఇంకా ఆలోచించడం వేస్ట్

నా బుఱ్ఱలో వెలుతురు అస్పష్టమైపోతున్నట్లన్పించింది లైబ్రరీ వరండాలో వెన్నెల పడటంలేదు నిరాశగా నిట్టూరుస్తూ వచ్చి అరుగుమీద కూర్చున్నాను

ఇదంతా ఒకటిన్నర నిముషాల్లో అయిపోయింది

మనసులోని బెదురునీ, గుండె వేగాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నాను వస్తున్న ఆకారంవైపే కళ్ళు పెద్దవిచేసుకొని చూశాను

అయినా ఏమిటింత భయపడుతున్నాను? ఈ సినిమాలు, నవలలూ నాకు తెలీకుండానే నన్నింత ప్రభావితంచేశాయా? ఊహు అన్నివేళలూ మనవి కాదంటుంది అమ్మ నిజంగానేనా?

తత్తరపడుతూ తదేకంగా చూశాను

దగ్గరగా వచ్చాడు! మొత్తానికి మగమనిషే అతను!

అక్కడకు దగ్గరగా పశువులశాలలున్నాయి

తాతగారన్నట్టు మేతవేయడానికి వెళ్తున్నాడేమో!

నేనే అనవసరంగా భయపడుతున్నానా? కొంచెం సంతోషం

కళ్ళెత్తి పిరికిపిరికిగా అతని పాదాలవైపే చూడసాగాను

అమ్మో! ఆగిపోయాడు నేనొక్కదాన్నే!

లైబ్రరీ అరుగుమీద వున్న నావైపు సందిగ్ధంగా నిలబడి చూశాడు ఓ రెండు నిముషాలు హిచ్‌కాక్ సినిమా చూస్తున్నట్టు అతనివైపే చూశాను

ఎందుకు ఆగాడు? అందుకు నేనే కారణమా? ఒకవేళ నేనే కారణమైతే

ఎంతో టిన్షన్‌తో బుఱ్ర వేడెక్కిపోతున్నది

బాబోయ్ అదే . నేను కూర్చున్న అరుగువైపే వస్తున్నాడు


దగ్గరగా   బాగా దగ్గరగా

నా అరుగు దగ్గరకేనా? ఇదేమిటి యిది గుండేనా?

# కె. ఉషారాణి

లోపల రైళ్ళుగానీ, మారాయా?

అతని అడుగుల చప్పుడిప్పుడు చాలా స్పష్టంగా చాలా సమీపంగా నా కతని మట్టిపాదాలు కూడా ప్రత్యక్షంగా కన్పిస్తున్నయ్



# ఓ వేకువ వెలుగులో

ఏమిటి? సూటిగా నా అరుగుదగ్గరకే వచ్చేస్తున్నాడా?

నేను రెప్పవేయడంలేదు. ఆ పాదాలు అరుగుల వైపే వస్తున్నయ్!

కానీ

అమ్మయ్య కొంచెంలో కొంచెం మెరుగు నా ఎదురుగా వున్న అరుగుమీద కూర్చున్నాడు

గుండెను కొంచెం చేతులతో అదుముకున్నాను

గుండెలో పరుగెత్తే రైళ్ళన్నిటినీ బయటకు పరుగెత్తించాలనుకున్నాను

ఫర్వాలేదులే. పాపం అతను కూడా ప్రయాణీకుడేమో!

తలెత్తడానికి ధైర్యం చాల్లేదు

అయినా జాగ్రత్తగా కొంచెం తలెత్తాను

అమ్మోయ్!

ఏమిటింత నల్లగా చింతమొద్దులా, యింత బలిష్టంగా వున్నాడు?

ఆ అరుగు నా కేమంత దూరంగా లేదే! కనుబొమ్మ లేంటి అంత దుబ్బుగా వున్నాయ్! కళ్ళు నావైపే అంత పరీక్షగా చూస్తున్నాయేంటి?

తల దించుకున్నాను భయంతో

ఓ అయిదారు నిముషాలు అలా గడిచిపోయినయ్ ఇంతలో

ఏంటా సన్నని చప్పుడు? ఎదురుగా తలెత్తి చూశాను

ఏమిటది?

అతను లేచాడు! ఎందుకు. ఎందుకు లేచాడు?

బస్సుకోసం వచ్చేవాడైతే, నాలాగా బస్సుడ్రైవరూ, కండక్టరూ బస్సు దగ్గరకు వచ్చేవరకూ స్థిరంగా కూర్చోవచ్చుగా? అయినా ఆ డ్రైవర్‌కూ, కండక్టర్‌కూ ఊళ్ళోకెళ్ళి నిద్రబోయే జబ్బేమిటి? పురాణాల్లో శాపాలన్నింటినీ గుర్తుకుతెచ్చుకునీ మరీ వాళ్ళిద్దర్నీ శంపించుకున్నాను అతను లేచి నిలబడి లైబ్రరీ ముందు హాలును పరిశీలనగా చూస్తున్నాడు మళ్ళా నా గుండెల్లో ఎన్నో సూపర్‌డీలక్స్‌లూ నాన్‌స్టాప్‌లూ వేగంగా పరుగెత్తసాగినయ్!

లైబ్రరీ హాలులో నికి నడిచాడతడు!

'బాబోయ్! ఎంత ఎత్తూ, లావూ! ఈ పర్సనాలిటీ ఏ డైరక్టరన్నా చూస్తే తప్పకుండా విలన్‌గా తీసుకొని వుండేవాడు' అనుకున్నాను ఛీ ఛీ వెధవబుర్ర ఇప్పుడుకూడా హాస్యంగా ఆలోచించడమేనా? దరిద్రపు అలవాటు తిట్టుకోవడం పూర్తిచేసి తలెత్తాను

చీకట్లో ఏం చేయడానికి వెళ్ళాడు? ఏం చెయ్యబోతున్నాడు?

కళ్ళు ఆర్పకుండా అలాగే చూస్తున్నాను

స్విచ్‌బోర్డు తడిమిచూస్తున్నాడతడు!

ఎందుకు? లైట్‌వేయడానికేనా? రోజూ యిటే వెళ్ళేవాడికి బల్బులేదని తెల్సివుండదా?

అయితే అయితే మరి లైట్ లేదని తెల్సుకోవడానికేనా? అవునా అవునా?

స్విచ్ వేశాడు! లైట్ వెలగలేదు!

లైటులేదని యితనికి స్పష్టంగా తెల్సిపోయిందా?

ఆ తర్వాత ఏం జరుగుతుంది?

వచ్చి మళ్ళా తనచోటులో నే కూర్చున్నాడు

అమ్మయ్య! ఫర్వాలేదు ఇప్పుడుకూడా నా అరుగుమీదకు రాలేదు

కాళ్ళు చలికి బిగదీసుకుపోతున్నయ్!

చెవుల్లో చలిగాలి దూరి నళ్ళంతా వణుకుతున్నది

అంత మంచుగాలికి పళ్ళు సరిగమలు పాడేస్తున్నయ్!

అయినా సర్దుకోవడానికి బయం

కదిలి సరిగ్గా కూర్చోవడానికి బయం

బిగదీసుకు కూర్చున్నాను

మళ్ళా ఓ అయిదారు నిముషాలు గడిచిపోయినయ్

మనసు మెల్లగా సర్దుకుంటున్నది మెల్లగా మాత్రమే!

సర్దుకొని కూర్చుందామని అనుకున్నాను ఇంతలో

అరేయ్ సాయన్నా! ఓ పొలికేక విన్పించింది

ఏవిటి? మనిషి అరుపేనా? వెధవమ్మెకులు ఈ గొంతుకిందకు ఏం పనికివస్తాయ్?

ఇంతకూ ఎవరి దా పొలికేక?

నోరు వెళ్ళబెట్టి తత్తరగా తలెత్తాను

ఒరేయ్! సాయన్నా! మరోగావుకేక ఈ శాల్తీ వేసన్నమాట ఆకేక!

అంత బిగ్గరగా ఎందుకు పిలుస్తున్నాడు!

నా కళ్ళముందు రోజూ పేపర్‌లో పడుతున్న రేప్ సంఘటనలు, సినిమాల్లోని రాక్షసకృత్యాలు గిరగిరా తిరుగాడసాగినయ్ వేగంగా!

'పిచ్చిమొహవా! నిన్నంతా హాస్టల్‌లో ఫ్రెండ్స్‌తో హాపీగాగడిపావ్ ఇప్పుడీ చిన్న పల్లెటూళ్ళో దిక్కూ మొక్కూ లేకుండా అలాగే బలయిపోతున్నావ్!' దుఃఖం పట్టలేకపోయాను


బిగ్గరగా రోదిస్తే నా పిరికితనం ముందుగానే తెలిస్తే!

మెదడులో అనేక ఆలోచనలు ఢీకొంటున్నయ్ అయినా అయిందిటికి బయల్దేరే బస్సుకి, ఆ శబ్దం విన్పించదేమోననే చాదస్తంతో వెన్నెల్లో ఈ పల్లెటూరి ప్రకృతిని చూడాలనే అమిత పిచ్చితో యింత ముందుగా ఎందుకురావాలి? ఇది అనుభవించడానికేనా?

ఊహు! లేదు నేను బలికాకూడదు. లేచి పరుగెత్తాలి లేచి పరుగెత్తాలి

అయ్యో! శరీరం సహకరించడంలేదేమిటి?

నా శరీరంలోనూ, హృదయంలోనూ యింత పిరికితనం దాగివున్నదా! మరీ యింతభయంకరమైన పిరికితనమా!



ఊహు కాదు లేవాలి ధైర్యాన్నంతా కాళ్ళల్లోకి తెచ్చుకోవాలి

అప్పుడే....

సరిగ్గా అప్పుడే . నేను అతనికి ఎదురుగా, నాకు వీపువైపు వున్న పూరిలోకి పరుగెత్తాలనుకున్నాను

అతను పిల్చిన సాయన్నే కాబోలు

చాలా వేగంగా "ఏందిరా సుబ్బులూ? అంటూ వచ్చాడు

అయిపోయింది అంతా అయిపోబోతోంది

నేను పరుగెత్తుదామన్న దిశనుండే అతను వస్తున్నాడు!

ఇద్దరి ఆకారాలు ఒకేలా పోతపోసిన ఇనుప విగ్రహాల్లావున్నయ్!

ఒకరికొకరు తోడు దొంగలా? ఇలాంటివాటిల్లో భాగం పంచుకోవడం కొందరు మగవాళ్ళకిష్టమని విన్నాను. వీళ్ళకు కూడా అదే యిష్టమా? దరిదాపు నన్ను రాసుకుంటూనే అతడు నా ఎదురునున్న అరుగువైపువచ్చాడు

నిస్సహాయంగా కళ్ళుమూసుకున్నాను

పిరికితనం, భయం ఉద్వేగం యివన్నీ మూకుమ్మడిగా నా శరీరాన్ని, మనసునూ సంపూర్ణంగా వశంచేసుకున్నాయ్!

ఆఖరినిముషంలో తనను నరకబోతున్న కత్తిని చూసి గిజగిజలాడుతున్న మేకపిల్లలా నిశ్చేష్టతతో అలా ఎంతసేపున్నానో నాకేతెలీదు

హఠాత్తుగా బస్సు యింజన్ స్టార్టయిన శబ్దం విన్పించింది ఉలిక్కిపడ్డాను సంతోషంతో ఉక్కిరిబిక్కిరై తలెత్తాను

వెలుతురులో బాగాస్పష్టత వచ్చింది

భయం భయంగా కళ్ళు రెపరెపలాడిస్తూ నా ఎదురుగావున్న అరుగుచూశాను.

వెలుతురువల్ల భయం తగ్గి నాలో ధైర్యం కొంచెం కొంచెంగా వూపిరిపోసుకుంటున్నది ఆ యిద్దరూ . నన్ను భయపెట్టిన ఆ రాక్షసులు (నాదృష్టిలో) ఒకరి వీపు నానుకుని ఒకరు కునికిపాట్లు పడుతున్నారు

లేస్తారేమోననే బెదురుతో నిదానంగా లేచాను

హారన్ మోయమంది. నేను వాళ్ళముందునుండే వెళ్ళాలి.

వాళ్ళిద్దరూ కూడా చటుక్కున మేలుకున్నారు. అరుగుమీద నుండి దూకినట్లు దిగి లేచి బట్టలు దులుపుకున్నారు.

నాకీసారి భయంవేయలేదు.

నింపాదిగా బస్‌వైపు నడవసాగాను

కానీ వెళ్ళబోతూ వాళ్ళిద్దరీ అసహ్యంగా, కోపంగా, కోరగా చూశాను

అయినా వాళ్ళు పట్టించుకోలేదు

అసలు నా చూపులు వాళ్ళకర్థమైవుండేస్తేగా!

నా వేనుకే నడిచారు

బస్సు మొదటిమెట్టుమీద నిలబడ్డాను నేను ప్రయాణీకులు ఎవ్వరూలేరు నే నొక్కదాన్నే తాతగారు చెప్పారు 'ఎవ్వరూ వుండరని'

'అమ్మాయ్‌గారూ! దండాలమ్మా వుంటాం చీకట్లో భయపడ్డారేమోనని వన్నన్ని మానుకుని



ఆంధ్ర కళాసమితి డొంబివిల్లి (మహారాష్ట్ర) వార్షిక సమావేశంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించిన నృత్యాంజలి విద్యార్థినులతో నృత్యాంజలి డైరెక్టరు శ్రీమతి విజయాప్రసాద్

కూర్చుడామమ్మా బేగి పనిచేసుకోవాలి రావులయ్యాగారి మనవరాలివి కదంటమ్మా నిన్నపొద్దుటేల వస్తుంటే చూసాలే దండాలమ్మా వుంటా జాగ్రత్తగా వెళ్ళు. ఆ పంచలో దీపవన్నాలేదూ' చేతులు జోడిస్తూ చెప్పాడు

నా కళ్ళముందు - మెరుపులు! నా హృదయంలో పొంగిపోయే నదులు!

నా కంటిపొరల్లో ఒక్కసెకన్‌లో ఉబికిన కన్నీరు!

అతని కళ్ళల్లో స్వచ్ఛత అమాయకత పాతిక ముప్పయేళ్ళ వయసుకే తెచ్చుకున్న పెద్దరికం ✓

"నేను కూడా ఎళ్తానమ్మా. అదికి తోడొచ్చాను ' రెండో అతను కూడా చేతులు జోడించాడు

శారీరకంగా ఏమీకాకపోయినా మానసికంగా చిత్తుగా ఓడిపోయాను అయితేనేం? మానవత్వపు మహిమ యింత అనిర్వచనీయమా!

బాగ్ తెరువబోయాను

ఛీ ఛీ. ఈ వెధవడబ్బుతో నిండిన ఈ నాగరికతతో ఈ స్వచ్ఛతను కించపరచబోతున్నానా? మళ్ళా తిట్టుకున్నాను కానీ నా హృదయంలో సముద్రపుఘోష

నేను చదువుకున్న నాగరీకురాల్ని!

కానీ వారి హృదయంలోని నాగరికత, స్వచ్ఛత నేను చెప్పలేకపోయిన 'థాంక్సు'లో గానీ, 'కృతజ్ఞతలు' అనే సామాన్య పదాల్లో గానీ యిమడకపోగా వాళ్ళు హిమాలయ శిఖరాగ్రాలు అధిరోహించినట్లు, ఆ శిఖరాల ముందు నేను చిన్న రేణువునైనట్లు చిన్నబోయాను

నిజానికి నన్ను నేను అంత కించపరుచుకో నక్కర్లేదు కానీ వారు పెదవి విప్పకముందు, నేను కొంచెంకూడా అవగాహనతో గానీ, తార్కికంగా కానీ ఆలోచించలేకపోయాను

కనీసం బస్ ఎక్కబోతూ కూడా నా హృదయం తెరుచుకోలేదు

ఎంత శూన్యమైన ఆలోచనా జ్ఞానం! అసహ్యంగా చూశానిందాకా భరించలేని భావావేశంతో నా కంటి రెప్పల్లో నిలబడ్డ కన్నీటిచుక్క బుగ్గలపై టప్‌మని జారిపడింది

సాగుతున్న బస్సులో నుండి హడావుడిగా పనికి వెళ్తున్న వాళ్ళిద్దరూ మసకగా కనిపిస్తున్నారు ☐